రాజకీయాల్లో ఆమె..

- ఉమ్మడి జిల్లాలో రాణిస్తున్న మహిళలు
- ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్లుగా రాణింపు
- స్థానిక సంస్థల్లో సగం పదవుల్లో వారే..
- ఎమ్మెల్యే, ఎంపీ పదవుల్లో ఇంకా వెనుకే..
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాజకీయాలంటే మగ వారికే అనుకునే రోజులు గతం. రాజకీయాలే కాదు.. అన్నింటా అతివలూ సగం అనేది ప్రస్తుతం . రాజకీయ పదవుల్లోనూ మహిళలకు స్థానాలున్నాయి. ప్రస్తుతం స్థానిక సంస్థల్లో 50శాతం స్థానాలను వారికే రిజర్వ్ చేశారు. చట్ట సభల్లోనూ సముచిత స్థానం కోసం పోరాటాలు కొనసాగుతున్నాయి. అయితే ఇప్పటికే కొందరు మహిళలు చట్టసభల్లో అడుగుపెట్టి తమ ప్రత్యేక తను చాటుతున్నారు. ఇంటి బాధ్యతలకే పరిమితం కాకుండా పురుష లీడర్లతో సమానంగా తమ సత్తా చాటుతున్నారు. అయితే ఇంకా ఉమ్మడి జిల్లాలో మహిళా నాయకులు, ప్రజాప్రతినిధుల సంఖ్య మరింత పెరగాల్సి ఉంది. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

జెడ్పీ చైర్‌పర్సన్లుగా ముగ్గురు..

ఉమ్మడి జిల్లాలోని నాలుగు జెడ్పీ స్థానాల్లో మూడింటిలో మహిళలే చైర్‌పర్సన్లుగా ఉన్నారు. తండ్రి మాజీ మంత్రి, కొట్నాక భీమ్‌రావు వార సురాలిగా మాజీ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కుమురం భీం ఆసిఫాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతు న్నారు. ఆసిఫాబాద్ సర్పంచ్‌గా మొదలైన ఆమె రాజకీయ ప్రస్థానం ప్రస్తుతం జెడ్పీ చైర్‌పర్సన్ వరకు కొనసాగుతోంది. ప్రస్తుతం ఆమె కుము రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో కీలక నాయకు రాలిగా ఉన్నారు. తన పెద్ద కూతురు అరుణ సిర్పూర్ (యూ) జెడ్పీటీసీగా పోటీ చేసి గెలుపొందారు. ఇక నిర్మల్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా కొరిపెల్లి విజయలక్ష్మి కొనసాగుతున్నారు. వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుని భర్త ప్రోత్సా హంతో జిల్లాలో కీలక స్థానంలో కొనసాగు తున్నారు. మంచిర్యాల జిల్లా పరిషత్ చైర్‌ప ర్సన్‌గా నల్లాల భాగ్యలక్ష్మి ఉన్నారు. తన భర్త ఓదెలు ప్రోత్సాహంతో రాజకీయాల్లో రాణిస్తున్నారు.



విజయలక్ష్మి



కోవ లక్ష్మి



నల్లాల భాగ్యలక్ష్మి

స్థానిక సంస్థల్లోనూ..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులుగా అనేక మంది మహిళలు రాణిస్తున్నారు. స్థానిక సంస్థల్లో సగం స్థానాలు మహిళలకే రిజర్వ్ చేశారు. దీంతో మగ వారితో సమానంగా వారూ పదవుల్లో కొనసాగుతున్నారు. మున్సిపాలిటీల్లో నూ మహిళా చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు ఉన్నారు. నాలుగు జిల్లాల్లో 12 మున్సిపాలిటీలు, 66 జెడ్పీటీసీ, 567 ఎంపీటీసీ, 1,508 సర్పంచ్, 12,554 వార్డు స్థానాలున్నాయి. వీటిలో ప్రతీ స్థానిక సంస్థల్లోనూ 50 శాతం సీట్లు మహిళలకే రిజర్వ్ చేయడంతో వారు సగం స్థానాల్లో పదవుల్లో ఉన్నారు.

ఏకైక మహిళా ఎమ్మెల్యే



రేఖానాయక్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో పది అసెంబ్లీ, రెండు ఎంపీ, ఒక ఎమ్మెల్సీ పదవుల్లో మగవాళ్లున్నారు. ఒక్క ఖానాపూర్ నియోజకవర్గం నుంచి మాత్రమే అజ్మీరా రేఖా నాయక్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆమె ఇక్కడి నుంచి రెండో సారి ఎమ్మెల్యేగా గెలిచి సమర్థవంతంగా పని చేస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా నుంచి అసెంబ్లీలో ఈమె ఒక్కరే ఉన్నా రు. ఆసిఫాబాద్ జెడ్పీటీసీగా మొదలైన ఆమె ప్రస్థానం, రాజకీయంగా గెలుపోటములను లెక్కచేయకుండా ప్రస్తుత స్థాయికి చేరుకున్నారు. భర్త శ్యామ్‌నాయక్ ప్రోత్సాహం, తన ప్రతిభతో రాజకీయాల్లో ధైర్యంగా ముందుకు వెళ్తున్నారు.

ప్రతిపక్షంలోనూ మహిళా నాయకత్వం



గండ్రత్ సుజాత



కొక్కిరాల సురేఖ

అధికార పక్షంలోనే కాకుండా ప్రతిపక్ష పార్టీలోనూ మహిళా నేతలు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా కొక్కిరాల సురేఖ కొనసాగుతున్నారు. ఆమె నిత్యం ప్రజల్లో ఉంటూ పార్టీని బలోపేతం చేస్తున్నారు. అలాగే పీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఆదిలాబాద్ జిల్లాలో కీలక నాయకురాలిగా గండ్రత్ సుజాత ఉన్నారు. నిర్మల్ నుంచి గత ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసిన స్వర్ణారెడ్డి ప్రజాసేవలో ఉన్నారు. వీరే కాకుండా ఆయా పార్టీలకు మహిళా విభాగా లు, ఇతర పదవుల్లో నాయకత్వం వహిస్తున్నారు. వీరిలో కొందరు మహిళా నాయకులు వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల బరిలో దిగనున్నారు.

స్వేచ్ఛా ప్రపంచం కావాలి



- పురుమలతో సమానంగా ఉండాలి
- కానీ ఇప్పటికీ పరిమితులున్నాయి..
- పనిచేసే చోట వేధింపులు..
- ఆడదంటే.. అదే చూపా..!?
- 'సాక్షి' సర్వేలో పలువురి అభిప్రాయం

నిర్మల్: 'తరాలు మారుతున్నా.. మహిళల తలరాత మారడం లేదు సార్. ఆడపిల్లను ఒంటరిగా బయటకు పంపాలంటే ఈరోజుల్లో కూడా ఎక్కడో ఓ మూలన భయం ఉంది. తను ఇంటికి వచ్చేదాకా మనసు తన గురించే ఆలోచిస్తుంది. ఆడదంటే.. అదే చూపా..!? చాలామంది మగవాళ్ల చూసే చూపులకే ఆడవాళ్ల తల పైకెత్తడం లేదు. ఇప్పటికీ ఇంట్లో మహిళలకు పరిమితులున్నాయి. పనిచేసే చోటా నరకంలా అనిపించే ఘటనలూ ఉంటున్నాయి. ఇలాంటి సందర్భాల్లోనే తమకంటూ స్వేచ్ఛా ప్రపంచం కావాలి అనిపిస్తుంది. ఆడదంటే గౌరవమిచ్చే సమాజం రావాలనిపిస్తుంది. ఆడ మగ వివక్ష లేకుండా పురుషులతో సమానంగా మహిళలను చూసే భావన ఉంటే ఎంతో బాగుంటుంది' అని పలువురు మహిళలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలు రంగాలకు చెందిన 30 మంది మహిళలతో పలు అంశాలపై 'సాక్షి' సర్వే నిర్వహించింది.

మహిళలకు స్వేచ్ఛ ఉండాలి



గతంతో పోలిస్తే మహిళలు ఇప్పుడు అన్నిరంగాల్లో రాణిస్తున్నారు. కాస్త ప్రోత్సహిస్తే ఏ పనైనా చేయగలుగుతున్నారు. కానీ సమాజంలో ఇప్పటికీ మహిళలకు కావాల్సినంత స్వేచ్ఛ లేదు. ఉద్యోగ, ఉపాధిరంగాల్లో ఇబ్బందులు తప్పడం లేదు.– కృష్ణవేణి, గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్

పరిమితుల మధ్యనే..



పురుషులతో పోలిస్తే స్త్రీలకు ఇప్పటికీ సమాజంలో చాలా పరిమితులు ఉన్నాయి. ఇలాంటి అడ్డుగోడల మధ్య ఉంటూనే ఎన్నో సాధించగలుగుతున్నారు. పరిమితులు లేని స్వేచ్ఛ, సమానత్వాన్ని ఇస్తే మహిళ సాధించలేనిదంటూ ఏదీ ఉండదు. – అన్నపూర్ణ, యోగా శిక్షకురాలు

న్యూస్‌రీల్

ఈదురు గాలులకు నేల వాలిన మొక్కజొన్న



పిప్రిలో మొక్కజొన్న పంట

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్, కన్కాపూర్, రాయపూర్‌కాండ్లీ రాయపూర్‌కాండ్లీ, . దర్మోరా, పంచగుడి, పిప్రి, బామ్నికే తదితర గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజామున భారీగా ఈదురు గాలులు రావడంతో మొక్కజొన్న, జొన్న, నువ్వు పంటలు దెబ్బ తిన్నాయి. గాలులకు విద్యుత్ స్తంభాలు విరిగాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో ఈదురుగాలులు నష్టం కలిగించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

కుంటాల మండలంలో..

కుంటాల: మండలంలోని ఓలా, కుంటాల, సూర్యాపూర్, అందాకూర్, లింబా(కే), పెంచికల్ పాడ్ గ్రామాల్లో ఆదివారం రాత్రి వీచిన బలమైన ఈదురు గాలులకు మొక్కజొన్న పంట నేలవాలింది. ప్రస్తుతం మొక్కజొన్న పంట కోత దశకు వచ్చింది. సుమారు మూడు గంటల పాటు ఈదురు గాలులు వీయడంతో పంట నేల వాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగుబడి తగ్గుతుందని, అధికారులు సర్వేచేసి బాధిత రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



కుంటాల: దెబ్బతిన్న పంటను చూపుతున్న రైతు

నేడు మహిళా పోలీసులకు సెలవు

నిర్మల్‌టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని మహిళా పోలీస్ అధికారులు, సిబ్బందికి బుధవారం సెలవు ప్రకటిస్తున్నట్లు ఎస్పీ ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ నిర్మాణంలో మహిళల పాత్ర చాలా గొప్పదని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో ప్రతీ మహిళ అన్నిరంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.

అతివల ఖిల్లా..!



రాధారాజారెడ్డి దంపతులు, ప్రముఖ నృత్య కళాకారులు

- జిల్లాలో పురుషులకన్నా మహిళలే అధికం
- సవాళ్లనూ అధిగమిస్తున్న 'ఆమె'
- అక్షరాస్యతలోనే వెనుకంజ

నిర్మల్: ఆమె లేకుంటే.. అసలు ఈ భూమే లేదు. సృష్టికర్త బ్రహ్మనే.. కానీ సృష్టిని నడిపించేది అమ్మే. తల్లిగా, చెల్లిగా, ఆలిగా, పాలికగా.. అవనిని నడిపిస్తోంది అతివ. కట్టుబాట్ల కాలం నుంచి కలలను సాకారం చేసుకునేదాకా ఎదిగింది. వంటింట్లో నుంచి బయటకొచ్చి నింగిదాకా ఎగిరింది. ఇప్పటికే చాలారంగాల్లో పురుషాధిక్యతను దాటేస్తోంది. ప్రతీరంగంలో తనదైన ముద్రను వేస్తోంది. మహిళాలోకంలో నిర్మల్ జిల్లాకు అరుదైన గుర్తింపు ఉంది. జనాభాలో ఆధిక్యత చాటుతూ అతివల ఖిల్లాగా పేరొందింది. గృహిణిగా ఉంటూనే ఆర్థిక, రాజకీయ, వ్యవసాయ, ఉద్యోగ, ఉపాధి, కళారంగాల్లో జిల్లా మహిళ రాణిస్తోంది.

ఎంతోమంది..

జిల్లా నుంచి ఢిల్లీ దాకా ఎదిగిన నేతలు ఉన్నారు. అలాగే ఆస్థాయిదాకా జిల్లా కీర్తిని తీసుకెళ్లిన మహిళామణులూ ఉన్నారు.

- జిల్లా నుంచి తెలంగాణ హైకోర్టు తొలి మహిళా న్యాయమూర్తిగా నియమితులయ్యారు కూచాడి శ్రీదేవి. భర్త న్యాయవాది కూచాడి శ్రీహరిరావు సహకారంతో గృహిణిగా ఉంటూనే న్యాయశాస్త్రం చదివి, ఏకంగా హైకోర్టు న్యాయమూర్తి అయ్యారు. జిల్లా కీర్తిని ఇనుమడింపజేశారు.
- భారతీయ నాట్యకళలో చిరస్థాయిగా నిలిచే రాధా రాజారెడ్డిది మన జిల్లానే. ఇందులో రాజారెడ్డికి తోడుగా నిలిచింది రాధమ్మ. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చివరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా తనదైన ముద్ర వేసింది శోభమ్మ.
- నిర్మల్ జిల్లాగా ఏర్పడిన తర్వాత మొదటి జెడ్పీ చైర్‌పర్సన్ కూడా మహిళే ఎన్నిక కావడం విశేషం . తొలిసారి రాజకీయాల్లోకి వచ్చిన విజయలక్ష్మి ఆ స్థానానికి మహిళగా పేరు తీసుకువస్తున్నారు.

ఇలా ఎంతోమంది విద్య, వైద్య, ఉద్యోగ, ఉపాధి, కళారంగాల్లో రాణిస్తూ మహిళామణులుగా జిల్లాకు పేరు తీసుకువస్తున్నారు. చాలామంది తాము ఎదుగుతూ.. తమతోపాటు మరికొందరికి చేయూతనిస్తున్నారు. మగవారికే పరిమితమనుకునే స్థానాల్లోనూ ధైర్యంగా నిలిచి పేరొందుతున్నారు. అన్నింట్లో ముందున్న మహిళలు జిల్లాలో అక్షరాస్యతలో మాత్రం కాసింత వెనుకంజలో ఉన్నారు.

వివరాలు(2011 లెక్కల ప్రకారం..)

జిల్లా జనాభా	7,09,418
పురుషులు	3,46,712
మహిళలు	3,62,697
లింగనిష్పత్తి	1,046
వర్కింగ్ వుమెన్	1,82,890
మహిళా రైతులు	40,148
మహిళా రైతుకార్మికులు	59,575
పారిశ్రామిక కార్మికులు	50,387
ఇతర కార్మికులు	32,780



కూచాడి శ్రీదేవి, హైకోర్టు న్యాయమూర్తి



వల్లకొండ శోభారాణి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్

ఢిల్లీలో పురస్కారం..



రాజుల లక్ష్మి.. మహిళలు తలచుకుంటే ఏదైనా సాధించగలరని నిరూపించారు. 'స్వయంశక్తి'తో ఎదిగి, ఢిల్లీలో పురస్కారం అందుకున్నారు. దిలావర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన స్వయంసహాయక సంఘం సభ్యురాలైన లక్ష్మీ స్త్రీనిధి రుణం ద్వారా జనరల్ స్టోర్, పిండిగిర్నీ, కూరగాయలు విక్రయిస్తూ ఉపాధి పొందుతోంది. మహిళగా, ఒంటరిగా ఉంటూ ప్రగతి సాధిస్తోంది. ఈమె శ్రమను గుర్తించిన కేంద్రం గతనెలలో ఢిల్లీలో నిర్వహించిన 'ఆది మహోత్సవ్'కు లక్ష్మిని ప్రత్యేకంగా ఆహ్వానించి పురస్కారం అందించింది.

అడవి సంరక్షణలో..



నైట్ పెట్రోలింగ్‌లో డీఎఫ్‌ఆర్‌వో శ్రీదేవి

శ్రీదేవి.. చుట్టూ దట్టమైన అడవి అయినా ఆమెకు భయం లేదు. ఎందుకంటే తన చుట్టూ ఉన్న చెట్లకు ఆమెకు నేస్తాలు. తాను కాపాడుకోవాల్సిన వనసంపద అది. ఇందుకోసం పగలైనా, రాత్రయినా విధులు నిర్వర్తించాల్సిందే. సారంగపూర్ డీఎఫ్‌ఆర్‌వో(డిప్యూటీ రేంజ్ ఆఫీసర్)గా పనిచేస్తున్న శ్రీదేవి 2006లో ఎఫ్‌ఎస్‌వోగా అటవీశాఖలో అడుగుపెట్టారు. సాదాసీదాగా ఉండే ఆమె నిత్యం సవాల్‌గా నిలిచే శాఖలో క్రమశిక్షణతో పనిచేస్తూ 2017లో డీఎఫ్‌ఆర్‌వోగా పదోన్నతి పొందారు. విధినిర్వహణలో దట్టమైన అడవుల్లోకి వెళ్లడం, రాత్రిపూట కూడా వనసంపద రక్షణ విధులు చేపట్టడం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

బడి పెట్టి.. ఉపాధి నిచ్చి..



సాయిమాధురి.. తను కుటుంబానికి అండగా నిలవడమే కాకుండా తనతోపాటు 12 మందికి ఉపాధినిస్తున్నారు. నిర్మల్‌కు చెందిన శ్రావణ్ స్థానిక ప్రైవేటు జూనియర్‌కాలేజీలో లెక్చరర్‌గా చేస్తున్నారు. తన భార్య నర్సాపూర్ (జి)కి చెందిన సాయిమాధురి చదువుకుంటానంటే ప్రోత్సహించడంతో ఆమె ఎంఏ, బీఈడీ పూర్తిచేశారు. టీచర్ ఉద్యోగం రాకున్నా ఆమె కుంగిపోకుండా ధైర్యంగా ప్రైవేటుస్కూల్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం తమ వివేకానంద స్కూల్‌లో తనతోపాటు 12 మంది మహిళా ఉపాధ్యాయులకు ఉపాధి కల్పిస్తున్నారు.

ఆమె పేరుపక్కన ఎల్ఎల్‌బీ..



నివేదిత.. చిన్నప్పుడు స్కూల్లో చదువుతుండగా తన పేరు పక్కన ఎల్ఎల్‌బీ అనే రాసుకునేవారు. ఇంటర్మీడియట్ చదువుతుండగానే పెళ్లయింది. పిల్లలు కుటుంబ బాధ్యతలు, సమస్యలు అన్నీ చుట్టుముట్టాయి. వాటన్నింటినీ నిర్వర్తిస్తూనే తన చిరకాల స్వప్నాన్ని నెరవేర్చుకున్నారు. జిల్లాకేంద్రానికి చెందిన కె.నివేదిత మహిళ న్యాయవాదిగా రాణిస్తున్నారు. తన భర్త కానిస్టేబుల్, ప్రముఖ కవి కారం శంకర్ సహకారంతో రచనా వ్యాసంగాన్నీ కొనసాగిస్తున్నారు. పోలీసు మాసపత్రిక సురక్షలోనూ వ్యాసాలు రాస్తున్నారు. సామాజిక దృక్పథంతో ఆలోచిస్తూ న్యాయవాదిగా అన్నివర్గాలకూ సేవలందిస్తున్నారు.

రంగ్ రబ్బా రబ్బా..



హోలీ వేడుకల్లో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్



రంగులతో యువతులు

జిల్లాలో హోలీ సంబురాలు అంబరాన్ని తాకాయి. చిన్నాపెద్ద, స్త్రీపురుష భేదం లేకుండా రంగుల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. డీజే పాటలకు స్టెప్పులు వేశారు. యువకులు బైక్‌లపై వీధుల్లో తిరుగుతూ సందడి చేశారు. కలెక్టర్ నివాసంలో నిర్వహించిన హోలీ వేడుకల్లో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ హోలీ ఆడారు. రెవెన్యూ అధికారులు, క్యాంప్ కార్యాలయ సిబ్బంది వేడుకల్లో పాల్గొన్నారు. – నిర్మల్‌చైన్‌గేట్/సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులతో కలిసి హోలీ జరుపుకుంటున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

ఆశ్రమ పాఠశాలలో నీటి కష్టాలు

భైంసాటౌన్: పట్టణంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. బోరు మోటారు చెడిపోవడంతోపాటు, భగీరథ నీరు సరఫరా కాలేదు. దీంతో హోలీ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు స్నానానికి నీళ్లు లేకపోవడంతో ఇబ్బంది పడ్డారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు అవస్థలు తప్పలేదు. దీంతో పక్క వీధిలో ఉన్న కుళాయిల నుంచి బకెట్లలో నీటిని తెచ్చుకున్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ భోజరాంను ఫోన్‌లో వివరణ కోరగా భగీరథ అధికారులతో మాట్లాడి నీటి సరఫరా పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు.



బయట నుంచి నీటిని తెచ్చుకుంటున్న విద్యార్థినులు

పల్లె నుంచి ఢిల్లీ వరకు..


అవగాహన కల్పిస్తున్న సుశీల

బోథ్: బోథ్ మండలంలోని మారుమూల ఆదివాసీ గ్రామమైన బాబెరకు చెందిన ఆత్రం సుశీల ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని గ్రామంలో వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణం చేసుకునేలా గ్రామస్తులను ప్రోత్సహించింది. దీంతో 2020లో రాష్ట్ర గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా స్వచ్ఛ అవార్డును పొందారు. ఆదివాసీ గ్రామాల్లో తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో మొక్కలు నాటాలని ప్రతి ఇంటి వద్ద మొక్కలను పెంచే ప్రయత్నం చేశారు. మహిళా సంఘం సభ్యురాలిగా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుంటూ ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారు. గత ఏడాది ఢిల్లీలో ఆదివాసీల వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. మారుమూల గ్రామంలో పుట్టిన ఆదివాసీ మహిళా ఉన్నతస్థాయికి ఎదగడంతో పలువురు ఆనందంగా వ్యక్తం చేస్తున్నారు.

సాగులో మేటి.. శిరీష


ఎద్దుల బండిపై పొలానికి వెళ్తున్న శిరీష

లోకేశ్వరం: పంటల సాగులో మేటిగా నిలుస్తోంది లోకేశ్వరం మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన మగ్గిడి శిరీష. భర్త సాయారెడ్డి కూడా రైతే కావడంతో ఆయనకు చేదోడు వాదోడుగా ఉంటూ అన్ని రకాల పంటల సాగులో రాణిస్తోంది. ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా 15ఏళ్లుగా శిరిష బెండ, టమాట, బీరకాయ, ఉల్లిగడ్డ, కొత్తిమీర, బీన్సీసకాయ, చిక్కుడుకాయ, వరి, మిర్చి, జొన్న, మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్నారు. డ్రిప్ విధానం సేంద్రియ పద్ధతి ద్వార పంటలను సాగు చేస్తుండడం విశేషం.

ఉపాధి వైపు అడుగులు..


పూలను పరిశీలిస్తున్న సుజాతారెడ్డి

ఇచ్చోడ: చిన్నప్పటి నుంచి మొక్కల పెంపకం అంటే ఆమెకు ప్రాణం.. వ్యవసాయ కుంటుంబంలో జన్మించిన సుజాతారెడ్డి కాల క్షేపం కోసం ఇంటి ఆవరణలో ప్రారంభమైన పూల, పండ్ల మొక్కల పెంపకం, ప్రస్తుతం ఉపాధి వైపు అడుగులుపడేలా చేశాయి. కూతురు ఉన్నత చదువుల కోసం పట్టణంలో ఉండటం, భర్త రాజకీయల్లో బిజీగా ఉండడంతో పూల మొక్కలు సాగుతో నలుగురికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.

పేదరికం ఓడిపోయింది..


పచ్చళ్లు, మురుకులు తయారు చేస్తున్న భూలక్ష్మి

బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన కడారి భూలక్ష్మి వివిధ రకాల పచ్చళ్లు, జొన్నరొట్టెలు, చపాతిలు, మురుకులు ఆర్డర్‌పై తయారు చేస్తూ సొంత కాళ్లపై నిలబడుతోంది. గతంలోనే భర్త శ్రీనివాస్ క్యాన్సర్ వ్యాధితో మృతిచెందారు. శివప్రియ, శ్రీజ ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పేదరికంలో ఉన్న ఆమెకు కుటుంబపోషణ భారంగా మారింది. గ్రామంలో అద్దె ఇంట్లో ఉంటోంది. కూతుర్లను చదివించాలనే సంకల్పంతో ఏదైనా వ్యాపారం మొదలు పెట్టాలని అనుకుంది. 2021లో గ్రామంలోని అన్నపూర్ణ గ్రామ మహిళా సంఘంలో సభ్యత్వం తీసుకుంది. స్త్రీనిధి ద్వారా రూ.40 వేలు, సహాయ సంఘం ద్వారా రూ.70వేల రుణాన్ని తీసుకుని శివసాయి పేరు మీద వ్యాపారాన్ని నెలకొల్పింది. పచ్చళ్లు, జొన్నరొట్టలు, చపాతి తయారీ, వివిధ రకాల మురుకులు వంటివి చేసి విక్రయిస్తోంది. ప్రస్తుతం నెలకు రూ. 10 నుంచి 15వేల వరకు సంపాదిస్తున్నట్లు ఆమె చెబుతోంది. పెద్ద కూతురు శివప్రియ ఆదిలాబాద్‌లోని జ్యోతిబాపూలే కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం, రెండవ కూతురు శ్రీజ ఆదిలాబాద్‌లోని బంగారుగూడలోని మోడల్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతోంది.

ఆమె స్ఫూర్తిగా..



- అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు
- మగవారికి సమానంగా ఆడపిల్లలను చదివిస్తూ..
- ఆర్థికంగా నిలదొక్కుకుంటూ.. ఇతరులకు ఉపాధినిస్తూ..
- రాజకీయాల్లోనూ తమముద్ర వేస్తున్న అతివలు
- ఆదర్శం.. జిల్లాలోని పలువురు మహిళలు
- నేడు ప్రపంచ మహిళా దినోత్సవం

ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో మహిళలు ఎన్నెన్నో అద్భుతాలు సాధిస్తున్నారు. ఎవరికీ తీసిపోని విధంగా.. ఎవరిపై ఆధారపడకుండా ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. కుటుంబానికి తోడ్పాటునందిస్తూ భరోసా కల్పిస్తున్నారు. తమతో పాటు ఇతరులకు సైతం ఉపాధి కల్పిస్తూ ముందుకుసాగుతున్నారు. మగవారికి తీసిపోకుండా ఆడపిల్లలను చదివిస్తూ స్ఫూర్తి నింపుతున్నారు. నేడు ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదర్శంగా నిలుస్తున్న జిల్లాలోని పలువురు మహిళలపై ప్రత్యేక కథనం.

womens day Special

రాజకీయంలో తనదైన ముద్రవేస్తూ..



బోథ్: మండల అభివృద్ధిలో జెడ్పీటీసీ డాక్టర్ సంధ్యారాణి తన పాత్ర పోషిస్తున్నారు. ఆమె వైద్యురాలు కావడంతో బోథ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిని అభివృద్ధి పరచాలనుకున్నారు. మంత్రులు, ఉన్నతాధికారులను కలిసి బోథ్ ఆసుపత్రికి రూ.10 కోట్లు భవన నిర్మాణానికి నిధులు తేవడంలో కీలక పాత్ర పోషించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించగలరని నిరూపిస్తున్నారు. మహిళలు ప్రజా ప్రతినిధులుగా ఉన్నా.. తమ భర్తలే పెత్తనం చెలాయిస్తున్న ఈ రోజుల్లో సంధ్యారాణి మాత్రం అన్ని విషయాలపై మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నారు.

– డా.సంధ్యారాణి, జెడ్పీటీసీ,బోథ్

అభివృద్ధి బాటలో..


శానిటరీ నాప్కిన్స్ తయారీలో మహిళలు

కుంటాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం సహాయక మహిళలను అభివృద్ధి బాటలో నడిపించేందుకు కుంటాలలో 20లక్షలు వెచ్చించి రేలా బయో డిగ్రేడేబుల్ శానిటరీ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో పలువురు మహిళలకు తయారీ కోసం ఉపాధి కల్పించారు. ఇక్కడ తయారుచేసిన వాటిని మార్కెట్లో విక్రయిస్తున్నారు. వచ్చే ఆదాయంతో పనిచేస్తున్న మహిళలకు వేతనాలు ఇవ్వడంతో సంఘాలకు ఆదాయం సమకూరుతుంది. త్వరలో దాల్ మిల్, పేపర్ ప్లేట్స్ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి కల్పిస్తామని అధికారుల వెల్లడించారు.

స్త్రీ సమానత్వమే ప్రగతికి మూలం



ఖానాపూర్: సమాజ నిర్మాణంలో సగభాగమైన స్త్రీ సమానత్వమే ప్రగతికి మూలం. అమ్మగా, అక్కగా చెల్లిగా కూతురిగా ఎన్నో బంధాలను, అధికారినిగా ఎన్నో బాధ్యతలను సమపాలల్లో నిర్వహించే నిర్వహణ బాధ్యతను స్త్రీ కలిగి ఉంటుంది. దీనికి తోడు ప్రతి మహిళా తమపై తమ ఆరోగ్యంపై తగిన శ్రద్ధ తీసుకోవడంతో ఎన్నో అద్భుతాలను లోకానికి పరిచయం చేస్తుంది. ఆధునిక పోకడలతో మారుతున్న చట్టాలపై అవగాహన తన జీవిత సౌదాలకు మెట్లుగా పనికొస్తాయి. మహిళలు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ అవరోదాలను అదిగమిస్తూ ముందడుగు వేయాలి.

– తునికి అరుణరవీందర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, భైంసా

అధ్యాపకురాలి సలహాతో..



కైలాస్‌నగర్: జిల్లా అడిషనల్ జడ్జిగా రాణిస్తున్న మాధవీకృష్ణ విజయగాథ ఎంతో మంది మహిళలకు ఆదర్శం. ఇంటర్మీడియట్ వరకు తెలుగులోనే చదివారు. ఐదేళ్ల లా కోర్సు ఇంగ్లిష్‌లో చదువాల్సి ఉంది. దీంతో ఆమె ఆందోళన చెందలేదు. ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. విజయవంతంగా లా కోర్సు పూర్తిచేశారు. అంతటితోనే ఆగిపోకుండా ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ఎంఎల్ లేబర్ లా గోల్డ్ మెడల్ సాధించారు. అలాగే ఏంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పట్టా అందుకున్నారు. ఐఆర్‌పీఎం డిప్లొమో కోర్సు పూర్తి చేశారు. ఎలాంటి లా ప్రాక్టీస్ చేయకుండానే 2003లో జడ్జిల నియామక పరీక్షకు హాజరై తొలి ప్రయత్నంలోనే విజయాన్ని అందుకున్నారు. 2005లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికై కరీంనగర్ జిల్లా హుజురబాద్ జూనియర్ ఫ్యామిలీ కోర్టు మేజిస్ట్రేట్‌గా నియమాకమయ్యారు. చోడవరం, నెల్లూర్, ఖమ్మం కోర్టుల్లో సేవలందించారు. 2017లో సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొంది జగిత్యాల ఫోక్సో పాస్ట్‌ట్రాక్ కోర్టు జడ్జిగా నియామకమయ్యారు. 2022 మేలో జిల్లా అడిషనల్ జడ్జిగా మరోసారి పదోన్నతి సాధించి ఆదిలాబాద్‌కు వచ్చారు.

– జిల్లా అడిషనల్ జడ్జి మాధవీకృష్ణ

ఉపాధి పొందుతూ.. ఉపాధినిస్తూ..


బట్టల దుకాణం నడుపుతున్న విజయ

లక్ష్మణచాంద: మహిళలు కేవలం గృహిణీలుగానే కాకుండా తాము కూడా మగవారితో సమానంగా పనులు చేయగలమని నిరూపిస్తున్నారు. మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన నాలుగ విజయ ఏడాది క్రితం స్త్రీనిధి పథకం ద్వారా రూ.లక్ష రుణం తీసుకుని మండల కేంద్రంలో బట్టల షాపు ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి తన కాళ్లపై తను నిలబడుతూనే మరో ఇద్దరికి ఉపాధిని కల్పిస్తోంది.


ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న బంధువులు

పెంబి పీహెచ్‌సీ అద్దాలు ధ్వంసం

- లో బీపీతో స్పృహ కోల్పోయిన గర్భిణి
- పెంబి పీహెచ్‌సీకి తీసుకువచ్చిన బంధువులు
- సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ఆగ్రహం


ధ్వంసమైన కిటికీ అద్దాలు

పెంబి: మండల కేంద్రంలోని ప్రైవేటు రక్త పరీక్ష కేంద్రం నిర్వహిస్తున్న రాజేష్ భార్య అనూష గర్భవతి లోబీపీతో మంగళవారం స్పృహ కోల్పోయింది. దీంతో మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి సాయంత్రం 5గంటలకు తీసుకు వచ్చారు. పీహెచ్‌సీలో సిబ్బంది లేకపోవడంతో ఆగ్రహనికి గురైన మహిళ బంధువులు ఆస్పత్రి ఎదుట ఉన్న మరుగుదొడ్డి కిటికిలు ధ్వంసం చేశారు. ఆసుపత్రికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఎక్కువగా గిరిజనులే ఉన్నారని, అనారోగ్యానికి గురైనప్పుడు కనీసం ప్రథమ చికిత్స చేసేందుకు కూడా పీహెచ్‌సీ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, రెగ్యులర్ డాక్టర్ లేక చాలా ఇబ్బందిగా అవుతుందని తెలిపారు. ఈ విషయంపై ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ సుభాష్‌ని వివరణ కోరగా... ఫార్మాసిస్ట్ ఉన్నాడని, కానీ అతడిని పట్టించుకోకుండా ఆందోళన చేసి ఆసుపత్రికి తాళం వేసి అద్దాలు ధ్వంసం చేశారని, వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ఆర్జీయూకేటీకి హరితహారం అవార్డు



వీసీకి అవార్డు అందిస్తున్న మంత్రి కేటీఆర్

భైంసా: బాసర ఆర్జీయూకేటీకి హరితహారం అవార్డు వరించింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. క్యాంపస్‌లో మొక్కల పెంపకంతో పాటు ఈకో పార్క్, సరస్సు సుందరీకరణ చేపట్టినందుకు ఈ అవార్డు దక్కినట్లు వీసీ వెంకటరమణ పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

భైంసాటౌన్: పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. రాజీవ్‌నగర్‌కు చెందిన లక్ష్మీకాంత్ మంగళవారం సాయంత్రం ఇంట్లో వాస్మోల్ తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కుటుంబీకులు స్థానిక ఏరియాస్పత్రికి తరలించగా వైద్యులు నిజామాబాద్‌కు రిఫర్ చేశారు.

అమ్మ ప్రోత్సాహంతో..

- అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న నిఖిత
- తండ్రిలేని లోటు తీర్చుతున్న తల్లి
- అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ
- గోల్డ్, సిల్వర్ పతకాలు కైవసం


తల్లి గంగామణితో నిఖిత

ఖానాపూర్: ఓ వైపు పేదరికం ఇబ్బందులు పెడుతున్నా.. ఆటల్లో పరుగుతీస్తోంది ఓ యువతి. ఖానాపూర్‌కు చెందిన నిఖిత తాను ఇష్టపడే అథ్లెటిక్స్‌తో పాటు ఇతర క్రీడల్లోనూ రాణిస్తోంది. పట్టణంలోని పద్మావతినగర్ కాలనీకి చెందిన జక్కుల గంగామణి, భీమన్న దంపతుల కూతురు నిఖిత క్రీడలపై ఉన్న ఆసక్తితో ఆయా పోటీల్లో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. తండ్రి భీమన్న అనారోగ్యంతో (2006)లో మృతిచెందినప్పటికీ తల్లే అన్నీతానై కొడుకు, కూతురును కష్టపడి చదివిస్తోంది. తల్లి కష్టాన్ని చూసిన నిఖిత తల్లికి సాయం చేస్తూనే క్రీడల్లో రాణిస్తోంది. ప్రస్తుతం డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో గత ఏడాది మే 14న నిర్వహించిన తెలంగాణ స్టేట్ అసోసియేషన్ గేమ్స్‌లో సత్తాచాటి రాష్ట్రస్థాయిలో గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించింది. అంతకుముందు 2019లో ఢిల్లీలో జాతీయ స్థాయి 800, 100 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించింది. గతంలోనూ గచ్చిబౌలిలో అనేక మార్లు జరిగిన షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్ తదితర పోటీల్లో సైతం పదుల సంఖ్యలో పతకాలు సాధించింది. ఆటల్లో మెరుగైన శిక్షణ తీసుకుని అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తోంది.

అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి..

జనవరిలో జరిగిన అండర్ ఆర్మ్ మహిళా క్రికెట్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించింది. పంజాబ్‌లో జరిగిన అండర్ ఆర్మ్ క్రికెట్ ఫెడరేషన్ కప్ 2022లో మహిళా విభాగం నుంచి అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గోల్డ్ మెడల్ సాధించడంతో పాటు అంతర్జాతీయ పోటీలకు సైతం ఎంపికైంది. ఫిబ్రవరి 20 నుంచి 24 వరకు ఇండో నేపాల్‌లో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక స్తోమత లేక సతమతమైంది. ఈ క్రమంలో జనవరి 23న ×చేయూత కోసం క్రీడాకారిణి ఎదురుచూపు× శీర్షిక సాక్షిలో ప్రచురితమైన కథనానికి పలువురు దాతలు ముందుకొచ్చి రూ.30వేల ఆర్థిక సాయం అందజేశారు. దీంతో గత నెల 24న నేపాల్‌లో పోఖ్రలో జరిగిన 'నాలుగో అండర్ ఆర్మ్ ఇండో–నేపాల్ ఇంటర్నేషనల్ క్రికెట్ కప్ 2023' పోటీలకు ఇండియా జట్టుతో కలిసి సత్తాచాటింది. దీంతో ఖానాపూర్ యువతి అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించడంతో క్రీడాకారులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణం తీసిన పోటీ

- బండరాయి మీదపైడి ఒకరి మృతి
- ఆచారంలో భాగంగా నిర్వహించిన పోటీ
- గతంలో దీనిని రద్దు చేసిన గ్రామస్తులు
- అయినా కొందరు నిర్వహించిన వైనం


కటక్‌వార్ రమేశ్ (ఫైల్)

బోథ్: హోలీ పండుగ రోజు బండరాయి ఎత్తే పోటీని నిర్వహించడం మండలంలోని గుర్రాలతాండ గ్రామంలో ఆచారంగా నిర్వహించేవారు. కొంతకాలం క్రితం ఈ పోటీని గ్రామస్తులు రద్దు చేశారు. అయినప్పటికీ మంగళవారం హోలీ సందర్భంగా పలువురు గ్రామస్తులు నిర్వహించిన బండారాయి ఎత్తే పోటీలో ఓ వ్యక్తి ప్రాణాలు పోయాయి. స్థానికుల వివరాల ప్రకారం... కటక్‌వార్ రమేష్(45) హైదరాబాద్‌లో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. హోలీ పండుగకు సొంత గ్రామమైన గుర్రాలతాండకు వచ్చాడు. హోలీ వేడుకల్లో భాగంగా గ్రామస్తులు బండరాయిని ఎత్తే పోటీలో పాల్గొన్నాడు. రమేష్ బండరాయిగా ప్రమాదవశాత్తు ఆ రాయి ఛాతిపై పడింది. దీంతో నోరు, ముక్కు నుంచి రక్తస్రావం కాగా స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. అతడి భార్య ఐదేళ్ల క్రితమే మృతిచెందగా కూతురు, కొడుకు ఉన్నారు.

శనగ కుప్ప దగ్ధం


సంఘటన స్థలం వద్ద రైతు

బజార్‌హత్నూర్: మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన యాల్ల గంగారెడ్డికి చెందిన చేనులో శనగ కుప్ప సోమవారం రాత్రి కాలిబుడిదైన సంఘటన చోటుచేసుకుంది. బాధిత రైతు వివరాల ప్రకారం ... పిప్రి గ్రామ సమీపంలో మూడెకరాల్లో శనగ పంట సాగుచేశాడు. పంటను కోసి కుప్పగా పెట్టి సోమవారం సాయంత్రం చేను నుంచి ఇంటికి వెళ్లాడు. రాత్రి భోజనం చేసి తిరిగి చేనులోకి వచ్చే సరికి పంటకుప్ప అగ్నికి దగ్ధమై కనిపించింది. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టి ఉండొచ్చని, దీంతో రూ.1.50లక్షల నష్టం వాటిల్లిందని వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సయ్యద్ ముజాహిద్ తెలిపారు.

తోడేళ్ల దాడిలో ఐదు గొర్రెలు మృతి

తాంసి: తోడేళ్ల దాడిలో ఐదు గొర్రెలు మృతిచెందిన ఘటన భీంపూర్ మండలంలోని తాంసి(కె) గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బుషి రమేష్ యాదవ్ రోజులాగా తన గొర్రెలను సాయంత్రం సమయంలో గ్రామ సమీపంలోని పాకలో ఉంచాడు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో కొట్టంలోని గొర్రెలపై తోడేళ్లు దాడి చేసి ఐదు గొర్రెలను హతమార్చాయి. రైతు రాత్రి సమయంలో గొర్రెలను చూసేందుకు వెళ్లగా అప్పటికే గొర్రెలు మృతిచెంది కనిపించాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చేరుకుని తోడేళ్ల దాడిలో మృతిచెందినట్లుగా భావించారు. దీంతో రూ.40వేల వరకు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.